సాక్షి జయశంకర్ భూపాలపల్లి

గురువారం । 18 ఏప్రిల్ । 2024



నేలకొరిగిన ఉద్యమ కెరటం
నమ్మిన సిద్ధాంతాల కోసం 25 సంవత్సరాల క్రితం అటవీ బాట పట్టిన చిట్యాల మండలం చల్లగరిగె గ్రామానికి చెందిన సిరిపెల్లి సుధాకర్ అసువులుబాశాడు. - 8లో▸



చేతికందని పుస్తకం..
కేయూ పరిధిలోని దూరవిద్య డిగ్రీ, పీజీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వకపోవడంతో నిరీక్షిస్తున్నారు. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
42.5⁰ /28.3⁰
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండలు దంచికొడుతాయి. వడగాలులు వీస్తాయి. రాత్రి కాస్త ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు



భూపాలపల్లి: లోక్‌సభ ఎన్నికల నామినేషన్ స్వీకరణ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. బుధవారం ఇతర ఉన్నతాధికారులతో కలిసి నామినేషన్ల స్వీకరణ, తుది ఓటరు జాబితా రూప కల్పనపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమావేశంలో సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ భవేశ్ మిశ్రా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ మంగీలాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికాస్ రాజ్ పలు సూచనలు, సలహాలు అందించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఓటరు నమోదు దరఖాస్తుల పరిష్కారం, ఓటరు స్లిప్‌ల పంపిణీ తదితర పనులను నిబంధనల మేరకు చేస్తున్నట్లు వెల్లడించారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి



టేకుమట్ల: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ మల్లేష్‌యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కేంద్ర పోలీస్ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల్లో ఏ పార్టీకైనా ఓటు వేసుకోవచ్చని, సోషల్ మీడియాలో ఇతరుల మనోభావాల్ని దెబ్బతీసే విధంగా, రెచ్చగొట్టే విధంగా ఫొటోలు, వీడియోలు పోస్ట్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్సై గోగికారి ప్రసాద్, కానిస్టేబుళ్ళు, టీఎస్ఎస్పీ, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఉన్నారు.

కాళేశ్వరంలో మద్యం దుకాణాలు బంద్



కాళేశ్వరం: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో మొదటి విడతలో పార్లమెంట్ ఎన్నికలు ఈనెల 19న జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో మహారాష్ట్రకు సరిహద్దులోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని రెండు మద్యం దుకాణాలను బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు కాటారం సీఐ నరేందర్ ఆధ్వర్యంలో బంద్ చేసి సీల్ వేశారు. మళ్లీ 19న పోలింగ్ ముగిసిన తర్వాత మద్యం దుకాణాలు తెరుచుకుంటాయని పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అక్కడి పోలీసులు ముందస్తుగా పకడ్బందీగా చర్యలు తీసుకోవడంతో సరిహద్దులోని మద్యం దుకాణాలు బంద్ చేసినట్లు తెలిసింది. జిల్లాలోని కాళేశ్వరంలో మాత్రమే మద్యం దుకాణాలు బంద్ పాటించనున్నాయి.

కాంగ్రెస్ నాయకుడికి షోకాజ్ నోటీస్



కాటారం(మహదేవపూర్): మహదేవపూర్ పోలీస్‌స్టేషన్‌లో నృత్యం చేసిన సంఘటనలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మహదేవపూర్ జెడ్పీటీసీ గుడాల అరుణ భర్త గుడాల శ్రీనివాస్‌కు జిల్లా కాంగ్రెస్ పార్టీ షోకాజ్ నోటీస్ జారీ చేసింది. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఐత ప్రకాశ్‌రెడ్డి ఈ నెల 15న షోకాజ్ నోటీస్ జారీ చేయగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాగా ఈ నెల 15న గుడాల శ్రీనివాస్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఓ పాటకు నృత్యం చేయగా ఆ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. యోగా, వ్యాయామం ప్రాముఖ్యత పోలీసులకు తెలియజేయడంలో భాగంగా ఇలా నృత్యం చేసినట్లు శ్రీనివాస్ సోషల్ మీడియా ద్వారా వివరణ ఇచ్చుకున్నారు. అయినప్పటికీ ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరే అదే రోజు విచారణ చేపట్టి ఎస్సైతో పాటు ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లపై వేటు వేశారు. ఇదే క్రమంలో నృత్యం అంశాన్ని కాంగ్రెస్ పార్టీ సైతం సీరియస్‌గా తీసుకున్నట్లు తెలిసింది. రాష్ట్ర స్థాయిలో వైరల్ కావడంతో స్పందించిన కాంగ్రెస్ జిల్లా కమిటీ క్రమశిక్షణ చర్యల్లో భాగంగా శ్రీనివాస్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేసింది. బాధ్యతాయుతమైన కాంగ్రెస్ కార్యకర్తగా ఉండి ఇలాంటి వాటికి పాల్పడటం సరికాదని నోటీస్‌లో పేర్కొంది. నోటీస్ జారీ అంశం మండలంలో చర్చనీయంగా మారింది.

కమనీయం.. రమణీయం

భూపాలపల్లి అర్బన్: హాజరైన భక్తులు



కల్యాణ తంతు నిర్వహిస్తున్న పండితులు, పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు



కాళేశ్వరం:తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు రామాచారి



మల్హర్: కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు



- వైభవంగా సీతారాముల కల్యాణం
- వేలాదిగా హాజరైన భక్తులు

- మరిన్ని ఫొటోలు 9లో▸

భూపాలపల్లి పట్టణంలో..



సీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులు

భూపాలపల్లి అర్బన్: సీతారాముల కల్యాణం బుధవారం జిల్లా వ్యాప్తంగా కనుల పండువగా జరిగింది. రామాలయాలు, హనుమాన్ దేవాలయం, శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో వేద పండితులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. కల్యాణ తంతును భక్తులు వీక్షించేందుకు ఆయా ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం అన్నదానం, పులిహోర, వడపప్పు, పానకం పంపిణీ చేశారు. వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

కాళేశ్వరంలో శాస్త్రోక్తంగా..



తలంబ్రాలు తీసుకు వస్తున్న సూపరింటెండెంట్

కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ దేవాలయమైన శ్రీరామాలయంలో సీతారామచంద్రస్వామి కల్యాణం వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. బుధవారం అర్చకులు ఆరుట్ల రామాచార్యుల ఆధ్వర్యంలో దేవస్థాన అర్చకులు, వేద పండితులు, కల్యాణ యాగ్నికులచే శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణ తంతును వైభవంగా నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్ తలంబ్రాలు, పట్టువస్త్రాలను సమర్పించారు. భక్తులకు దేవస్థానం అధికారులు తగిన ఏర్పాట్లు చేయకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. అనంతరం దేవస్థాన అన్నదాన సత్రంలో టీఎస్ఎండీసీ పీఓ తారక్‌నాథ్ రెడ్డి సహకారంతో భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రేవెల్లి మమత, మాజీ సర్పంచులు రాంరెడ్డి, సత్తమ్మ, మాధవి, మాజీ ధర్మకర్తలు అశోక్, సమ్మయ్య, శ్యావదేవుడా తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల పాట్లు

వేసవి నేపథ్యంలో పశుగ్రాసం కొరత
- ఆకాశాన్నంటుతున్న దాణా, తవుడు ధర
- పచ్చిగడ్డి పండించుకునేందుకు పెరిగిన కౌలు
- పాల దిగుబడి తగ్గడంతో నిరాశ



మేతకు వెళ్తు వస్తున్న పశువులు

భూపాలపల్లి రూరల్: వానాకాలంలో అధిక వర్షాలు, వేసవిలో ఎండ తీవ్రతతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతికూల వాతావరణంతో పశుగ్రాసానికి ఉపయోగపడే పంటలు పండకపోవడంతో బెంబేలెత్తుతున్నారు. పశుగ్రాసం కొరతతోపాటు దాణా, తవుడు ధరలు అధికంగా ఉండటంతో కొనలేని పరిస్థితి నెలకొంది. దీంతో పాడి రంగానికి తీవ్ర సంక్షోభం తీసుకువచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. గతంలో ప్రతీ ఏడాది రైతులకు లభించే పశుగ్రాసం ఈ ఏడాది అందుబాటులో లేకపోవడం, ఉన్న కొద్ది పాటి గ్రాసం కూడా అధిక ధరల కారణంగా రైతులు కొనలేకపోవడంతో పాల దిగుబడి తగ్గుతుందని పాల వ్యాపారులు అంటున్నారు. పరిస్థితి ఇలా ఉంటే రానున్న రోజుల్లో పాల కొరత తీవ్రంగా ఉండొచ్చని, ఇటు వ్యాపారులు, అటు రైతులు అంటున్నారు

ప్రతికూల వాతావరణం..

జిల్లాలో ఈ ఏడాది మొదట్లో వర్షాలు, వరదల కారణంగా చాలా చోట్ల పొలాలు, చేన్లలో ఇసుక మేటలు పెట్టాయి. దీంతో మొక్కజొన్న తదితర పంటల సాగు తగ్గిపోయింది. అక్కడక్కడ వేసిన పంటలు కూడా ప్రస్తుత వేసవి ఎండల నేపథ్యంలో ఎండి పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రత్యేకంగా పశువుల కోసం వేసుకున్న పంటలు కూడా చేతికందకుండా పోయాయి. బోర్లు ఉన్న చోట సాగు చేసిన పంటలు తక్కువ విస్తీర్ణంలో ఉండటంతో ధరలు ఎక్కువయ్యాయని రైతులు అంటున్నారు. కాగా గతంలో జిల్లాలో వరి పంట తక్కువగా సాగు చేసినప్పటికీ పశు గ్రాసాన్ని దృష్టిలో పెట్టుకొని కృష్ణా నది, జూరాల ఆయకట్టు ప్రాంతాల నుంచి గడ్డిని తెచ్చుకునేవారు. ఈ ఏడాది అక్కడ కూడా అంతంత మాత్రంగానే పంటలు పండటంతో వరి గడ్డి ధర కూడా పెరిగింది. దీంతో రైతులు గ్రాసం కొనేందుకు వెనకాడుతున్నారు.

మూగజీవాల వివరాలు..

ఆవులు	69,427
గేదెలు	62,758
గొర్రెలు	2,91,765
మేకలు	80,848
కోళ్లు	4,20,144

ఆకాశాన్నంటుతున్న ధరలు

పశువుల కోసం వాడే గ్రాసం, దాణా ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. గతంలో దాణా క్వింటా రూ.2,400 ఉండగా.. ప్రస్తుతం రూ.3 వేలు దాటింది. వరి గడ్డి ట్రాక్టర్ రూ.10 వేలు ఉండగా.. ప్రస్తుతం రూ.20 వేల వరకు పలుకుతోంది. తౌడు 50 కేజీల బస్తా రూ.1,500 నుంచి రూ.2వేల వరకు పెరిగింది. దీంతో రైతులు వాటిని కొనేందుకు జంకుతున్నారు. సరైన దాణా అందించపోవడంతో పాల దిగుబడి కూడా తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పశువులకు నిత్యం వాడే పచ్చిగడ్డి పండించేందుకు పాడి రైతులు పొలం కౌలుకు తీసుకుని, అందులో గడ్డి పండించేవారు. గతంలో ఎకరాకు రూ.10 వేలు ఉన్నకౌలు ప్రస్తుతం బోర్లలో నీరు ఇంకిపోయిన కారణంగా ఉన్న కొద్దిపాటి బోర్ల కిందనే ఈ గడ్డి పండిస్తున్నారు. అందులో ఎకరాకు రూ.20వేలకు పైగా నడుస్తుండటంతో రైతులు కౌలుకు తీసుకునేందుకు వెనకాడుతున్నారు. పశుగ్రాసం కొనలేని రైతులు మేత కోసమని ఎండలో పశువులను బయటకు తీసుకెళ్తున్నారు.



పొలాల్లో వరిగడ్డిని మేస్తున్న గేదెలు

ఎక్కువ మొత్తంలో ఉన్న పశువులకు గ్రాసం, దాణా ఇవ్వలేక, పాల దిగుబడి తగ్గి నష్టం చవి చూడాల్సి వస్తుందని పాడి రైతులు వాపోతున్నారు.

పాల దిగుబడి తగ్గింది..



దాణా దొరకకపోవడంతో పాల దిగుబడి తగ్గింది. సరైన వర్షాలు లేకపోవడం, ప్రస్తుత ఎండల కారణంగా పశుగ్రాసం పంటలు పండటం లేదు. దీంతో వరి గడ్డి తదితర పశుగ్రాసం ధరలు విపరీతంగా పెరిగాయి. వీటితో పాటు దాణా, తవుడు ధరలకు రెక్కలొచ్చాయి. పాడి పశువులకు ఎక్కువగా దాణా వాడితేనే పాల దిగుబడి వస్తుంది. పచ్చిగడ్డి పండించేందుకు కౌలు కూడా పెంచారు. దీంతో పశువులకు సరైన గ్రాసం కొనేందుకు ఇబ్బందికరంగా మారింది.

– మార్క చేరాలు, పాడి రైతు, గుర్రంపేట

నేటినుంచి లోక్‌సభ నామినేషన్ల స్వీకరణ

- అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం: వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య
- అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్
- సభలు, వాహనాల ప్రచారం అనుమతులతోపాటు పలు అంశాలపై సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రావీణ్య

ఖిలా వరంగల్: లోక్‌సభ ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ వెలువడనుంది. అదేరోజు నుంచి అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించనున్నారు. 25వ తేదీ వరకు దాఖలుకు అవకాశం ఉంది. అభ్యర్థులు నామినేషన్ పత్రాలను వరంగల్ జిల్లా రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి ఉచితంగా పొందవచ్చు. సెలవులు మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి వరంగల్ కలెక్టరేట్‌లో, మహబూబాబాద్ స్థానానికి సంబంధించి మహబూబాబాద్ కలెక్టరేట్‌లో అభ్యర్థులు నామినేషన్లు సమర్పించాల్సి ఉంటుంది.

అభ్యర్థులకు నిబంధనలు..

- ఒక్కో అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయొచ్చు.
- అభ్యర్థి వెంట నలుగురికి మాత్రమే అనుమతి ఉంటుంది.
- జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల తరఫున పోటీ చేసే అభ్యర్థులకు వారు పోటీ చేసే నియోజకవర్గంలోని ఎవరైనా ఒక ఓటరు ప్రతిపాదించాల్సి ఉంటుంది.
- రిజిస్టర్డ్ రాజకీయ పార్టీల తరఫున, స్వతంత్ర అభ్యర్థులకు 10మంది ఓటర్లు ప్రతిపాదించాలి.
- పోటీ చేసే అభ్యర్థులు వేరే లోక్‌సభ సెగ్మెంట్‌కు చెందిన వారైతే తప్పనిసరి వారి అసెంబ్లీ నియోజకవర్గ ఈఆర్‌ఓ నుంచి ఓటరు ధ్రువీకరణ పత్రం సమర్పించాలి.
- అభ్యర్థులు గరిష్టంగా రూ.95లక్షల వరకు ఎన్నికల్లో ఖర్చు చేయవచ్చు.
- సంబంధిత బ్యాంకు ఖాతా లావాదేవీల ఆధారంగానే అభ్యర్థులు వ్యయాన్ని లెక్కిస్తారు.
- నామినేషన్ పత్రంలోని పార్ట్–3ఏ లో క్రిమినల్ కేసుల వివరాలు పొందుపర్చాలి.
- ప్రచార సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తుగానే అనుమతి పొందాలి.
- కరపత్రాలు, పోస్టర్లు, ఫ్లెక్సీల విషయంలో సెక్షన్ 127–ఏ సూచనలు పాటించాలి.
- ప్రచార కార్యక్రమాలు, సభలు, సమావేశాలకు సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

సమన్వయంతో పనిచేయాలి
– ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల నోడల్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి పార్లమెంట్ నియోజక పరిధిలోని 7అసెంబ్లీ సెగ్మెంట్లలోని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, జిల్లా నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఎన్నికల ప్రచారం చేసే అభ్యర్థుల వాహనాల అనుమతులకు సువిధ ద్వారా రిటర్నింగ్ అధికారి పరిధిలో మంజూరు చేయాలని, సభలు, సమావేశాలకు సంబంధిత అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు లేదా ఎన్నికల అధికారుల స్థాయిలో మంజూరు చేయాలన్నారు. ఎస్ఎస్‌టీలు గురువారం ఉదయం నుంచి విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో లైవ్ వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. అధికారులు సకాలంలో రోజువారీ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ ఫారం 12 స్వీకరణ, అత్యవసర సర్వీసెస్, వృద్ధులు, దివ్యాంగుల హోం ఓటింగ్ ఈ నెల 25లోగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి పోలింగ్‌కేంద్రంలో వీల్ చైర్లతోపాటు వలంటీర్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

పొరపాట్లు జరగొద్దు..

నామినేషన్లు స్వీకరణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అధికారులు, సిబ్బంది జాగ్రత్తగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మాక్ (ట్రయల్) నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓలు శ్రీనివాస్, వైవీ గణేష్, డీఎస్ వెంకన్న, రోహిత్ సింగ్, నారాయణ, వెంకటేష్, సీడం దత్తు, మంగీలాల్, జిల్లా నోడల్ అధికారులు రామిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

శ్రీరాముడి పాలన ఆదర్శనీయం

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు




కల్యాణంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు

కాటారం: శ్రీరాముడి పాలన ప్రతీఒక్కరికి ఆదర్శనీయమని, వారి ఆశీస్సులతో ప్రజలు సంతోషంగా ఉండాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. కాటారం మండలం ధన్వాడ దత్తాత్రేయ స్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకల్లో శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ముందుగా మంత్రి ధన్వాడలోని తన స్వగృహంలో అర్చకులు వేదమంత్రోచ్చరణల మధ్య శ్రీ సీతారామలక్ష్మణ, అంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాలకు గణపతి పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం తలంబ్రాల బియ్యం, పట్టు వస్త్రాలను స్వామి వారికి సమర్పించారు. వైభోపేతంగా జరిగిన ఈ కల్యాణ వేడుకలను మంత్రి గ్రామస్తులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సీతారాముల ఆశీస్సులతో యావత్ తెలంగాణ రాష్ట్ర ప్రజానీకం, మంథని నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని సీతారాములను కోరుకున్నట్లు తెలిపారు. రాముడిని ఆదర్శంగా తీసుకొని అందరం ముందుకు కదలాలని, ఎన్ని ఇబ్బందులు వచ్చినా ధర్మాన్ని నమ్ముకొని ముందుకెళ్లిన మహోత్తముడు రాముడన్నారు. రాబోయే వర్షాకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని పాడి పంటలు బాగా పండి రైతుల కష్టాలు తొలగడానికి త్వరలో యాగ నిర్వాహణకు ఏర్పాట్లు చేయాలని పురోహితులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పంతకాని సమ్మయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు, ఎంపీటీసీ జాడి మహేశ్వరీ, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, నాయకులు చిటూరి మహేశ్, కొట్టె ప్రభాకర్, చీమల రాజు, పురోహితులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

నిప్పుల కొలిమి

- కొత్తపల్లిగోరిలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



భూపాలపల్లి అర్బన్: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో బుధవారం అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. కొత్తపల్లిగోరి మండలంలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు గుర్తించారు. జిల్లా కేంద్రంలో 43 డిగ్రీలు నమోదైంది. ఉదయం 9 గంటల నుంచే ఎండ వేడిమి ప్రభావం కనిపించింది. ఒక్కసారిగా ఎండ తీవ్రత పెరగడంతో ప్రజలు బయటకు రావాలంటే జంకుతున్నారు.

రోజుకు 9 గంటలు

కోచింగ్ లేకుండా సివిల్స్ ర్యాంకు సాధించిన కౌశిక్

- రెండేళ్ల కఠోర శ్రమకు ఫలితం.. 82వ ర్యాంకు
- ఏడాది పాటు కన్సల్టెన్సీగా ఉద్యోగం
- అభినందనలతో ముంచెత్తిన స్నేహితులు, బంధువులు



కౌశిక్‌కు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

జనగామ: రోజుకు తొమ్మిది గంటలు.. రెండేళ్ల కఠోర శ్రమ.. కోచింగ్ లేకుండా స్వశక్తితో ప్రిపరేషన్.. సీనియర్ల సలహాలు, సూచనలతో సివిల్స్‌లో ఆలిండియా 82వ ర్యాంకు సాధించిన మెరుగు కౌశిక్ నేటితరం యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. జనగామ పట్టణానికి చెందిన కౌశిక్ ర్యాంకు సాధించిన తర్వాత మొదటిసారి బుధవారం జిల్లా కేంద్రానికి రాగా.. స్నేహితులు, బంధువులు అతడికి ఘన స్వాగతం పలికి అభినందనలతో ముంచెత్తారు. విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు, స్నేహితులు సత్కరించి ఆశీస్సులు అందించారు.

పలువురి సత్కారం..

సివిల్స్ ర్యాంకర్ కౌశిక్‌ను జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ సుగుణాకర్‌రాజు, కౌన్సిలర్ సుధ తదితరులు సత్కరించారు. అలాగే బాలాజీనగర్ రేణుక ఎల్లమ్మ ఆలయ కాలనీవాసులతోపాటు సురుగు సుధాకర్ గౌడ్, రాజు, ముస్త్యాల దయాకర్, ఉల్లుంగుల సందీప్, తిప్పారపు విజయ్, సతీష్, ఆటపా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గంగిశెట్టి ప్రమోద్‌కుమార్, ఐవీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బిజ్జల నవీన్‌కుమార్, వాసవీ క్లబ్ గ్రేటర్ పట్టణ అధ్యక్షుడు పడకంటి రవీందర్, రాజు అభినందించి సన్మానించారు.

కౌశిక్ పట్టుదల స్ఫూర్తిదాయకం : ఎమ్మెల్యే 'పల్లా'

కోచింగ్ లేకుండా.. స్వశక్తితో సివిల్స్‌లో 82వ ర్యాంకు సాధించడం మామూలు విషయం కాదు.. కౌశిక్ పట్టుదల యువతకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సతీమణి నీలిమ, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునతో కలిసి ఆయన కౌశిక్‌ను సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ మంచి అడ్మినిస్ట్రేటివ్ స్కిల్స్‌తో జనగామ పేరు ప్రతిష్టలను నిలబెట్టాలని ఆకాంక్షించారు.

జనగామ పేరు నిలబెడతా..
– 'సాక్షి'తో సివిల్ ర్యాంకర్ కౌశిక్



ఉస్మానియా వర్సిటీలో సివిల్ ఇంజినీరింగ్ పూర్తయిన తర్వాత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్‌లో ఎంబీఏ చదివాను. తర్వాత కన్సల్టెంట్‌గా ఏడాదిపాటు ఉద్యోగం చేశాను. సివిల్స్‌కు ప్రిపేర్ కావడానికి ఉద్యోగం మానేశాను. 2022 నుంచి రెండు షిఫ్టుల్లో రోజుకు తొమ్మిది గంటల పాటు ప్రిపేర్ అయ్యాను. యూట్యూబ్‌లో వచ్చే స్టాండర్డ్ బుక్స్‌ను మల్టీపుల్‌గా చూసుకుంటూ.. సీనియర్ల సలహాలు, సూచనలు తీసుకున్నా. ఆన్సర్ రేటింగ్ కోసం తరచూ టెస్ట్ సిరీస్ రాయడం, డౌట్స్ ఎప్పటికప్పుడు క్లియర్ చేసుకుని తప్పులను సరిచేసుకోవడం వల్ల ఈ ర్యాంకు సాధించగలిగా. మాక్ ఇంటర్వ్యూలు కలిసొచ్చాయి. గతంలో సివిల్స్ ఎంట్రెన్స్‌ల్లో వచ్చిన ప్రశ్నలను ఒకటికి రెండు సార్లు రివైండ్ చేసుకున్నా. తల్లిదండ్రులు ఇచ్చిన ప్రోత్సాహంతోనే ఐఏఎస్ సాధించగలిగా. పుట్టిన ఊరు ప్రజలు చూపిస్తున్న అభిమానాన్ని మరువలేను. జనగామ పేరు నిలబెడతా.

..అందుకే ఐఏఎస్ కావాలనుకున్నా

యూపీఎస్సీ ర్యాంకర్ ప్రణయ్‌కుమార్



ప్రణయ్‌కుమార్‌ను ఓపెన్ టాప్ వాహనంలో ఊరేగిస్తున్న గ్రామస్తులు

'పౌరులకు వైద్యం, విద్య, తాగునీరు, రహదారుల వంటి మౌలిక వసతుల కల్పన, పేదరికం నిర్మూలన కోసం కృషి చేసేందుకే ఐఏఎస్ కావాలనుకున్నా' అని యూపీఎస్సీ ఆల్ ఇండియా 554వ ర్యాంకర్ కొయ్యడ ప్రణయ్‌కుమార్ అన్నారు. బుధవారం స్వగ్రామమైన రఘునాథపల్లికి తన తల్లిదండ్రులు లక్ష్మి, ప్రభాకర్‌తో వచ్చిన ప్రణయ్‌కుమార్‌ను గ్రామపెద్దలు ఓపెన్‌టాప్ జీప్‌పై ఊరేగించి ఘన స్వాగతం పలికారు. - 8లో▸

– రఘునాథపల్లి

క్లుప్తంగా

ఘనంగా రాంకోటి వివాహం



రాంకోటి విగ్రహానికి వివాహం జరిపి అక్షింతలు వేస్తున్న తల్లిదండ్రులు

బయ్యారం: చనిపోయిన కుమారుడి కోరిక మేరకు ఆ తల్లిదండ్రులు కొడుకు విగ్రహానికి శ్రీరామనవమి సందర్భంగా ఘనంగా వివాహం జరిపించారు. మహబూబాబాద్ జిల్లా మండలంలోని సంతులాల్‌పోడు తండాకు చెందిన భూక్య లాలు–సుక్కమ్మ దంపతుల కుమారుడు రాంకోటి పెళ్లీడుకు వచ్చాక అర్థంతరంగా చనిపోయాడు. తల్లి కలలోకి వచ్చి నా పెళ్లి జరిపించాలని చెప్పడంతో అతడి కోరిక మేరకు తల్లిదండ్రులు ఇంటి వద్ద గుడి కట్టించి అందులో కుమారుడి విగ్రహం, యువతి నమూనా విగ్రహాలు ప్రతిష్ఠించారు. ఇరవై ఏళ్లుగా శ్రీరామనవమి రోజున వివాహం జరిపిస్తున్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే బుధవారం కూడా ఇంటి వద్ద కుమారుడు, యువతి విగ్రహాలకు నూతన వస్త్రాలు ధరింపజేసి శాస్త్రోక్తంగా వివాహం జరిపించారు.

రైలులో గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కాజీపేట రూరల్ : బల్లార్షా, కాజీపేట రామగిరి ప్యాసింజర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాజీపేట జీఆర్‌పీ ఎస్సై మోహినోద్దీన్ కథనం ప్రకారం.. గుర్తు తెలియని సుమారు 55 ఏళ్ల వయసు గల వ్యక్తి మంగళవారం రామగిరి ప్యాసింజర్‌లో ప్రయాణిస్తున్నాడు. మార్గమధ్యలో మంచిర్యాల దాటిన తర్వాత మృతి చెందాడు. ప్రయాణికులు గమనించి రైల్వే సిబ్బందికి ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న కాజీపేట జీఆర్‌పీ పోలీసులు రైలు కాజీపేట జంక్షన్ స్టేషన్‌కు చేరుకోగా రాత్రి మృతదేహాన్ని కిందికి దింపారు. మృతుడు బ్లూ కలర్ షర్టు, వైట్ లైన్స్ నీలం రంగు లుంగీ ధరించాడు. పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మోహినోద్దీన్ బుధవారం తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు కాజీపేట జీఆర్‌పీ పోలీస్‌స్టేషన్‌లో గాని లేదా 8712658609, 9949859108 నంబర్లలో సంప్రదించాలన్నారు.

చేతికందని పుస్తకం..

దూరవిద్య సెమిస్టర్ పుస్తకాల రూపకల్పనలో జాప్యం

- కొన్నికోర్సులకు అందుబాటులో.. మరికొన్ని రాయించే దశలోనే..
- అడ్మిషన్లు పొంది ఆరునెలలు దాటినా పుస్తకాల కోసం నిరీక్షణే
- డిగ్రీ, పీజీ కోర్సుల్లో మొత్తం 5,040 మంది విద్యార్థులు ప్రవేశం



కేయూలో ఎస్‌డీఎల్‌సీఈ భవనం

కేయూ క్యాంపస్: యూజీసీ డెబ్ నిబంధనల మేరకు కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య డిగ్రీ, పీజీ కోర్సుల్లో ఈ విద్యాసంవత్సరం (2023–2024) నుంచి సెమిస్టర్ సిస్టమ్‌ను తీసుకొచ్చారు. ఇందులో ప్రవేశాలకు గతేడాది ఆగస్టు, సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ ఇచ్చి అక్టోబర్ 31వరకు అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించారు. వివిధ కోర్సుల్లో విద్యార్థులు చేరారు. అయితే అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు వెంటనే పాఠ్యపుస్తకాలు అందించలేదు. ఫలితంగా ఆయా విద్యార్థులు కొన్ని నెలలుగా పుస్తకాల కోసం నిరీక్షిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ ఏడాది ఫిబ్రవరిలో మళ్లీ 2023–2024 విద్యా సంవత్సరానికి మరోసారి కూడా యూజీ, పీజీ కోర్సుల్లో అడ్మిషన్లకోసం నోటిఫికేషన్ ఇచ్చారు. తొలుత నోటిఫికేషన్‌లో బీఏ కోర్సు లేదు. మళ్లీ ఈ నోటిఫికేషన్‌లో బీఏ కోర్సుకు అనుమతి లభించింది. దీంతో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో అడ్మిషన్ల ప్రక్రియ మార్చి నెలాఖరువరకు కొనసాగింది.

కొన్ని కోర్సులకు పుస్తకాలు అందుబాటులో ఉండి విద్యార్థులకు అందజేస్తుండగా మరికొన్ని కోర్సులకు ఇంకా రాయించే దశలోనే (రూపకల్పన) ఉంది. ఇంకొన్ని ప్రింటింగ్ దశలో ఉన్నాయని చెబుతున్నారు. కాగా, అంతకుముందు డిగ్రీ, పీజీ కోర్సులకు సంబంధించి ఇయర్‌వైజ్‌గానే వార్షిక పరీక్షలు నిర్వహించారు.

ఎమ్మెస్సీ కోర్సులకు పుస్తకాల రూపకల్పన ఇప్పట్లో లేనేట్లేనా?

దూరవిద్య పీజీ సైన్స్ కోర్సుల్లో ఎమ్మెస్సీ మ్యాథ్స్, బాటనీ, జువాలజీ , ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించారు. ఇందులో కొందరు విద్యార్థులు చేరినప్పటికీ వీరికి ఇప్పటికీ పుస్తకాలు ఇవ్వలేదు. దీంతో ఆయా విద్యార్థులు నిరీక్షిస్తున్నారు. ఈ కోర్సుల పుస్తకాలు రూపొందించడంలో (రాయించడంలో) జాప్యం జరుగుతోంది. అవి ఎప్పటికి పూర్తిచేస్తారో కూడా సందిగ్ధంగానే ఉంది.

బీఎల్ఐఎస్సీ క్లాస్‌లు షురూ

బీఎల్ఐఎస్సీ కోర్సుకు డిమాండ్ ఉంది. ఈ కోర్సులో చేరిన విద్యార్థులకు ఇటీవలే మొదటి సెమిస్టర్ తరగతులు ప్రారంభించారు. వీరికి కూడా ఇప్పటివరకు పుస్తకాలు అందించలేదు. ఆయా పుస్తకాలను ఈనెల 21న విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తామని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

కేయూ ఎస్‌డీఎల్‌సీఈ పేరు మార్పు

కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎస్‌డీఎల్‌సీఈ పేరును సెంటర్‌ఫర్ డిస్టెన్స్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సీడీఓఈ) మార్చారు. యూజీసీ డెబ్ నిబంధనలకు అనుగుణంగా ఈ పేరును మార్చుచేశారు. దీంతో ఆఫ్‌లైన్‌లోనే గాకుండా ఆన్‌లైన్‌లో కూడా కోర్సులు నడిపించే అవకాశం లభించింది.

80శాతం పుస్తకాలు ప్రింటింగ్ పూర్తి కావొచ్చాయి



కేయూ దూరవిద్య డిగ్రీ , పీజీ కోర్సుల్లో అడ్మిషన్ల ప్రక్రియ సెమిస్టర్ సిస్టమ్‌లో పూర్తయింది. సెమిస్టర్‌సిస్టమ్‌లో నేను డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనతికాలంలోనే ఇప్పటి వరకు 80 శాతం పుస్తకాలు ప్రింటింగ్ దశలో పూర్తికావొచ్చాయి. ఇప్పటికే ముద్రించిన కొన్ని కోర్సు పుస్తకాలు విద్యార్థులకు అందజేశాం. కొన్ని కోర్సుల పుస్తకాలు రాయించే దశలో ఉన్నాయి. వాటిని కూడా త్వరగానే పూర్తిచేయిస్తాం.

ఆచార్య వి. రాంచంద్రం,
డైరెక్టర్, కేయూ దూరవిద్య కేంద్రం

డిగ్రీ, పీజీ కోర్సుల్లో కలిపి 5,040 మంది విద్యార్థులు

డిగ్రీ, పీజీ కోర్సులు కలిపి రెండు నోటిఫికేషన్ల ద్వారా మొత్తం 5,040మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. కొన్ని కోర్సులకు డిమాండ్ ఉన్నా మరికొన్ని కోర్సుల్లో అంతంత మాత్రంగానే చేరారని సమాచారం. ఇక పీజీ డిప్లొమా సర్టిఫికెట్ కోర్సుల్లో కూడా అంతంత మాత్రంగానే అడ్మిషన్లు జరిగాయని తెలుస్తోంది. రెండో నోటిఫికేషన్ ద్వారా డిగ్రీ, పీజీ అన్నికోర్సులు కలిపి కేవలం 974మంది విద్యార్థులే చేరారని సమాచారం. డిగ్రీ బీఏ, బీకాం కోర్సుల విద్యార్థులకు పుస్తకాలు అందుబాటులోఉండగా వారికి అందజేస్తున్నారు. తెలుగు, ఇంగ్లిష్ పుస్తకాలు అందజేస్తుస్తుండగా..బీఎస్సీ మ్యాథ్స్, స్టాటిస్టిక్స్‌కు సంబంధించిన పుస్తకాలు రూపకల్పన దశలోఉన్నాయని సమాచారం. అలాగే, ఎంకాం కోర్సులకు సంబంధించి పుస్తకాలు అందజేస్తుండగా.. ఎంఏ కోర్సులోని వివిధ విభాగాల పుస్తకాలు కొన్ని పూర్తి కావొచ్చాయని, మరికొన్ని ఇంకా రాయించే దశలోనే ఉన్నాయని తెలుస్తోంది.

..అందుకే ఐఏఎస్ కావాలనుకున్నా

- యూపీఎస్సీ ర్యాంకర్ ప్రణయ్‌కుమార్



ప్రణయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

రఘునాథపల్లి: పౌరులకు విద్య, వైద్యం, తాగునీరు, రహదారుల వంటి మౌలిక వసతుల కల్పన, పేదరిక నిర్మూలనలో భాగస్వామ్యం కావడానికే ఐఏఎస్ కావాలనుకున్నానని యూపీఎస్సీ ఆల్ ఇండియా 554 ర్యాంకర్ కొయ్యడ ప్రణయ్‌కుమార్ అన్నారు. తన తల్లిదండ్రులు లక్ష్మి, ప్రభాకర్‌తో కలిసి బుధవారం స్వగ్రామం రఘునాథపల్లికి వచ్చిన ప్రణయ్‌కుమార్‌కు.. పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామపెద్దలు ఘన స్వాగతం పలికారు. ఓపెన్ టాప్ వాహనంలో నేరుగా అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకొని పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రణయ్‌కుమార్ మాట్లాడుతూ ఐఏఎస్ కావాలనే లక్ష్యంతో ప్రిపేరయ్యా.. లక్ష్యం సాధించినందుకు ఆనందంగా ఉందన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే సాధ్యమైందన్నారు. కాగా, ప్రణయ్‌కుమార్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు శాగ కైలాసం అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొల్లం అజయ్, మేకల నరేందర్, కొయ్యడ మల్లేష్, కోళ్ల రవిగౌడ్, పేర్ని రవి, రంగోజు ఈశ్వరయ్య, జేరిపోతుల మహేందర్, కడారి రవి, పెద్దగోని రాజు తదితరులు పాల్గొన్నారు.

అధికారం పోయినా.. కేసీఆర్‌కు అహంకారం తగ్గలేదు

- సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న వేం నరేందర్‌రెడ్డి

సాక్షి, మహబూబాబాద్: ధనిక రాష్ట్రంగా తెలంగాణ ప్రజలు కేసీఆర్ చేతిలో పెడితే అప్పులు చేసి.. అక్రమాలకు పాల్పడి, కమీషన్లు తీసుకొని.. రాష్ట్రాన్ని దివాలా తీయించిన మాజీ ముఖ్యమంత్రికి ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెప్పారని, అధికారం కోల్పోయినా.. కేసీఆర్‌కు ఇంకా అహంకారం మాత్రం పోలేదని రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారుడు, మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డి విమర్శించారు. 19న మానుకోటలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే బహిరంగ సభ ఏర్పాట్లను బుధవారం పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో మంచి నీటి ఇబ్బందులకు కాంగ్రెస్ ప్రభుత్వమే అని బీఆర్ఎస్ నాయకులు చెప్పేందుకు సిగ్గుపడాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్‌లో వచ్చింది అంటే అప్పుడు చలికాలం.. వర్షాకాలంలో అధికారంలో ఉన్నది బీఆర్ఎస్.. చలికాలంలో వర్షాలు పడుతాయా.. నీటి కష్టాలకు కాంగ్రెస్‌కు ఏం సంబంధం అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి, నాణ్యతాలోపంపై దేశం అంతా తెలంగాణను చులకనగా చూసే పరిస్థితి వచ్చిందన్నారు. ఇంత దుర్మార్గపు పనులు చేసిన కేసీఆర్, ఆయన అనుచరులు చీటికి మాటికి కాంగ్రెస్‌ను ప్రభుత్వాన్ని కూలగొడతామని, ఏడాదే ప్రభుత్వం ఉంటుందని చెప్పడం ఆయన అహంకార పూరిత విధానాలకు నిదర్శనం అన్నారు. తొమ్మిదేళ్లు పనిచేసిన ముఖ్యమంత్రి అనే మర్యాదతో ఉన్నామని, అది తీసేస్తే నీకన్నా ఎక్కువ మాట్లాడగలమని హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదని చెప్పారు. 14 సీట్లు కాంగ్రెస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బలరాం నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 19న జరిగే సీఎం రేవంత్‌రెడ్డి సభలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్, ఎమ్మెల్యేలు మురళీనాయక్, రాంచంద్రునాయక్, నాయకులు భరత్ చందర్‌రెడ్డి, వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, ఘనపురపు అంజయ్య, ఉదయ్‌చందర్, అయ్యప్పరెడ్డి, నూనావత్‌రాధా తదితరులు పాల్గొన్నారు.

రమణీయం.. రాములోరి కల్యాణం..

కనుల పండువగా కోదండరాముడి వివాహ వేడుక

- వల్మిడిలో వైభవంగా శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు
- స్వామి వారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన ఆలయ ఈఓ



సీతారామచంద్ర స్వామి వారి కల్యాణం తిలకిస్తున్న భక్తులు

పాలకుర్తి/పాలకుర్తి టౌన్ : వేదపండితుల మంత్రోచ్చారణలు.. మంగళ వాయిద్యాలు.. వేలాది మంది భక్తుల జయజయద్వానాల మధ్య జగదభిరాముడు పెళ్లి వేడుకలు అంబరాన్నంటాయి. శ్రీరామ నవమి సందర్భంగా పాలకుర్తి మండలం వల్మిడి గ్రామంలో గుట్టపై ఉన్న సీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం శ్రీ సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న స్వామి వార్లకు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. పలు రకాలు పుష్పాలతో సీతమ్మను, శ్రీరామ చంద్రుడిని అందంగా అలంకరించారు. కల్యాణ వేదికపై వేద పండితులు 12 గంటల సమయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు కోదండరాముడి పెళ్లి వేడుకలు కల్లారా చూసి తరించారు. కాగా, సీతారాముల కల్యాణోత్సవానికి పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి దంపతులు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, బీజేపీ జిల్లా నాయకుడు లేగ రామ్మోహన్ రెడ్డి హాజరయ్యారు.

శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో..

పాలకుర్తిలోని శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహా స్వామి ఆలయం, పాటిమీది ఆంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. బమ్మెర, వావిలాల, విస్నూరు, ఇరవెన్ను, చెన్నూరు గ్రామాల్లో కూడా శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి.



కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

ఎండు గంజాయి పట్టివేత

- నలుగురు విద్యార్థుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన సీఐ సురేష్



మాట్లాడుతున్న సీఐ సురేష్

హసన్‌పర్తి: గంజాయి వ్యాపారం చేస్తున్న నలుగురు విద్యార్థులతో పాటు మరో ఇద్దరు ప్రైవేట్ ఉద్యోగులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి గంజాయిని కొనుగోలు చేసి.. దానిని చిన్న ప్యాకెట్లలో నింపి విక్రయిస్తున్నట్లు నిందితులు అంగీకరించారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ సురేష్.. విలేకరులకు వెల్లడించారు. ఎన్నికల వి.ధుల్లో భాగంగా బుధవారం ముచ్చర్ల శివారుతో పాటు హసన్‌పర్తి పెద్ద చెరువుసమీపంలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ముచ్చర్ల వద్ద ఓ ఆటో పోలీసులను గమనించి ఆపకుండా ముందుకు సాగింది. దీంతో పోలీసులు వెంబడించి ఆటోను పట్టుకున్నారు. అందులో ప్రయాణిస్తున్న పెద్దమ్మ గడ్డకు చెందిన ఎండీ సైలానీ(విద్యార్థి), కొత్తూరుకు చెందిన ఎండీ నవాజ్ (ప్రైవేట్ ఉద్యోగి), హనుమకొండ పోచమ్మకుంటకు చెందిన బొజ్జ పూర్ణచందర్ (ప్రైవేట్ ఉద్యోగి)ని విచారించగా తాము ఎండు గంజాయిని కొనుగోలు చేసి..వాటిని వివిధ కళాశాలల్లో విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. దీంతో వారిని అరెస్ట్ చేసి కిలో ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

హసన్‌పర్తి పెద్ద చెరువు వద్ద..

మరో బృందం హసన్‌పర్తి పెద్ద చెరువు సమీపంలో ఓ బైక్‌ను తనిఖీ చేయగా అందులో మరో కిలో ఎండు గంజాయి లభించింది. దీంతో సరుకును స్వాధీనం చేసుకు హసన్‌పర్తి మండల కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన బొంమ్మాటి సాయిచరణ్, ఎన్జీఓస్ కాలనీకి చెందిన గొంట్టె సుమంత్, కన్నం విజయ్‌బాబు (ముగ్గురు విద్యార్థులు)ను అరెస్ట్ చేసినట్లు సీఐ చెప్పారు. సమావేశంలో ఎస్సై అశోక్, రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు

- క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

వరంగల్ స్పోర్ట్స్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో ఈ నెల 20 నుంచి మే 20వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5 సెంటర్లలో ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వరంగల్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. హనుమకొండలోని క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో బుధవారం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఐదు ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో వరంగల్‌లో ఎల్‌బీ కళాశాల మైదానంలో, మహబూబాబాద్‌లో సిద్దార్థ హైస్కూల్ గ్రౌండ్, భూపాలపల్లిలో సింగరేణి మైదానం, పరకాలలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్, ములుగులో జంగేడు క్రీడా మైదానంలో శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆయా చోట్ల కోచ్‌లుగా గోవింద్‌సింగ్, బీ వేణు, మహిళా కోచ్‌గా ఝాన్సీ(98496 59114) (వరంగల్), కుమార్, వినయ్ (98664 79666) (మహబూబాబాద్), కరుణాకర్, రాజ్‌కుమార్(8897805683) (భూపాలపల్లి) , అరుణ్ (9666206662) (పరకాల), మట్టెడ కుమార్, సందీప్ నేత్ర (90301 30727)(ములుగు) వ్యవహరిస్తారని శ్రీనివాస్ తెలిపారు. అండర్–14, 16,19,23 బాలబాలికల విభాగాల్లో నిర్వహించే ఈ శిబిరాల్లో పాల్గొనే క్రీడాకారులు httpr-://www.hycricket.orf ద్వారా మాత్రమే పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు మే చివరి వారంలో జరగనున్న రాష్ట్ర స్థాయి టీడీఎల్ 2024 టోర్నమెంట్‌కు ఎంపిక చేయడంతో పాటు హెచ్‌సీఏ అకాడమీకి ఎంపికయ్యే అవకాశం దక్కనుందని తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్‌గౌడ్, ఉపాధ్యక్షులు నజీమ్, రఘురాం, ఖాజా, కార్యవర్గ సభ్యులు అభినవ్, వినయ్, మట్టెడ కుమార్ పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు

- బాధితుడికి స్థలం అప్పగింత



ఇన్‌స్పెక్టర్ మల్లయ్యకు కృతజ్ఞతలు తెలుపుతున్న బాధితుడు ఇక్బాల్

ఖిలా వరంగల్: వరంగల్ చింతల్ బ్రిడ్జి సమీపాన ఓ వృద్ధుడు తన కుమార్తె వివాహం కోసం 1996లో 270 గజాల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఆ భూమిపై భూ కబ్జాదారుల కన్నుపడింది. తప్పుడు పత్రాలతో భూమిపైకి వచ్చిన కబ్జాదారులపై భూ బాధితుడు దేశాయిపేట రోడ్డుకు చెందిన ఇక్బాల్.. మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయాన్ని ఏసీపీ నందిరామ్‌నాయక్, పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా దృష్టికి ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తీసుకెళ్లారు. విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని సీపీ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఇన్‌స్పెక్టర్ మల్లయ్య కబ్జాదారుల, భూ బాధితుల భూ పత్రాలను పరిశీలించారు. తప్పుడు పత్రాలతో భూమిపైకి వచ్చినట్లు నిర్ధారించి భూ కబ్జాదారులపై ఇన్‌స్పెక్టర్ చట్టరీత్యా చర్యలు తీసుకుని భూ బాధితుడు ఇక్బాల్‌కు న్యాయం చేశారు. ఈమేరకు బాధితుడు ఇక్బాల్, అతని కుమార్తె, సామాజిక కార్యకర్త ఎండీ..ఫసి మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్యను బుధవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

బైక్ చోరీ చేసిన వ్యక్తులపై ఫిర్యాదు

ఖిలా వరంగల్: బైక్ చోరీ చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మృతుడి తల్లి మిల్స్‌కాలనీ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి కథనం ప్రకారం.. కరీమాబాద్ దసరా రోడ్డుకు చెందిన వడ్డెపల్లి శ్రీలత కుమారుడు సాయితేజ్.. గత నెల 29వ తేదీన రాత్రి శంభునిపేట నాగమయ్య కమాన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుమారుడు మృతి చెందిన బాధలో ఉండగా ఇంటిలో పార్క్ చేసిన టీఎస్ 03 ఎఫ్‌సీ 1732 నంబర్‌గల పల్సర్ బైక్ చోరీకి గురైంది. ఈ క్రమంలో కరీమాబాద్‌కు చెందిన కొలిపాక నాగశివ, కోదాటి చక్రి, శ్రీధర్ వద్ద తన కుమారుడి బైక్ కనిపించింది. బైక్ ఇవ్వాలని ఎంత ప్రాధేయపడినా వారు ఇవ్వడం లేదు. ఈ విషయంపై పోలీసులు స్పందించి బైక్ చోరీ చేసిన ముగ్గురిపై చర్యలు తీసుకుని, తనకు బైక్ ఇప్పించాలని కోరింది.

నేలకొరిగిన ఉద్యమ కెరటం

- ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు సిరిపెల్లి సుధాకర్ మృతి
- ముగిసిన 25 ఏళ్ల ఉద్యమ ప్రస్థానం
- చల్లగరిగెలో విషాదఛాయలు



సుధాకర్ (ఫైల్)



రోదిస్తున్న సుధాకర్ తల్లి రాజపోశమ్మ

చిట్యాల: ఉద్యమ కెరటం నేలకొరిగింది. నమ్మిన సిద్ధాంతాల కోసం 25 సంవత్సరాల క్రితం అడవి బాట పట్టిన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగె గ్రామానికి చెందిన సిరిపెల్లి సుధాకర్ అలియాస్ శంకర్ అసువులుబాశాడు. మంగళవారం ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేరు జిల్లా ఛోట్ బేటియా మాడ్ ప్రాంతంలో మావోయిస్టులు, భద్రతాదళాల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. దీంతో చల్లగరిగెలో విషాదఛాయలు అలుముకున్నాయి.

25 సంవత్సరాల క్రితం అడవి బాట..

నిరుపేద కుటుంబానికి చెందిన సిరిపెల్లి రాజపోశమ్మ, ఓదెలు దంపతులకు ఒక కుమార్తె, ఒక కుమారుడు సుధాకర్ ఉన్నాడు. సుధాకర్ పాఠశాల స్థాయి నుంచే విప్లవ సాహిత్యంపై మక్కువ చూపేవాడు. స్థానిక పాఠశాలలో 9వ తరగతి వరకు చదువుకుని మిత్రుడు రౌతు విజేందర్ అలియాస్ శ్రీనుతో కలిసి మావోయిస్టు సానుభూతి పరుడిగా పని చేసి 1996లో అజ్ఞాతంలోకి వెళ్లాడు. అంతకు ముందే సోదరుడు (బంధువు) కలికోట శంకర్ అప్పటికే పీపుల్స్‌వార్‌లో పని చేయడంతో సుధాకర్‌లో విప్లవ బీజాలు మొలకెత్తాయి. ఈ క్రమంలో పోలీసులకు లొంగిపోయి కొంతకాలం విజేందర్‌తో కలిసి సుధాకర్ జైలు జీవితం గడిపాడు. అనంతరం విజేందర్‌తో కలిసి 1998లో సుధాకర్ మళ్లీ అడవి బాట పట్టారు. ఈ క్రమంలో 6 ఏళ్ల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌లో విజేందర్ మృతి చెందగా, సుమారు 25 సంవత్సరాల నుంచి సుధాకర్ అజ్ఞాతంలోనే ఉన్నారు. దళ సభ్యుడి హోదా నుంచి నిజామాబాద్ జిల్లా కమిటీ సభ్యుడిగా, అనంతరం శంకర్ పేరుతో ఛత్తీస్‌గఢ్ ఏరియాలో జిల్లా కార్యదర్శిగా ఎదిగి మావోయిస్టు సాయుధ బలగాల్లో తనదైన ముద్ర వేసినట్లు సమాచారం. కాగా, సుధాకర్ తండ్రి ఓదెలు గతంలోనే అనారోగ్యంతో మృతి చెందగా, తల్లి వృద్ధాప్యంతో తీవ్ర ఇబ్బందులు పడుతోంది.

నా కొడుకును ఇలా చూస్తానని అనుకోలేదు దేవుడా..

'25 సంవత్సరాల క్రితం అన్నల్లోకి వెళ్లాడు. ఇప్పటి వరకు ఒక్కసారి కూడా ఇంటికి రాలేదు. ఇంటికి రాకున్నా పరవాలేదు. కానీ, ఎక్కడున్నా నా కొడుకు బతికే ఉండాలి. నేను బతికి ఉన్నప్పుడు నా కొడుకును ఒక్కసారి చూడాలి అనుకున్నా. దేవుడా నా కొడుకును ఇలా చూస్తానని అనుకోలేదు దేవుడా' అంటూ సుధాకర్ తల్లి రాజపోశమ్మ రోదిస్తున్న తీరు పలువురిని కంటతడికి గురిచేసింది.

ఛత్తీస్‌గఢ్ వెళ్లిన కుటుంబీకులు..

పోలీసుల సమాచారం మేరకు సుధాకర్ కుటుంబీకులు బుధవారం ఛత్తీస్‌గఢ్ చేరుకున్నారు. సుధాకర్ మృతదేహాన్ని చూసి బోరున విలపించారు.